ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
మంగళవారం 25 ఫిబ్రవరి 2025



విద్య, వైద్యానికే ప్రాధాన్యం

● సీఎం ఫార్మసీల ప్రారంభోత్సవంలో స్టాలిన్



సీఎం పార్మసీలను దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ తరహా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్ళువంటివని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన వైద్యాన్ని అందించడంలో రాష్ట్రం ముందంజలో ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. కొట్టూరుపురంలో అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయం సమావేశ మందిరంలో రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి సీఎం ఫార్మసీలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అంతకు ముందు ఆయన టి.నగర్ పాండీబజార్‌లోని సీఎం ఫార్మసీని తనిఖీ చేశారు. ఆ దుకాణంలో మందుల విక్రయాలను కూడా లాంఛనంగా ప్రారంభించారు.



టి.నగర్ పాండీబజార్‌లో మందుల విక్రయాన్ని ప్రారంభిస్తున్న సీఎం

ఇక ప్రారంభోత్సవ సభలో స్టాలిన్ మాట్లాడుతూ.. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబాల కోసం రాష్ట్రమంతటా వెయ్యి సీఎం ఫార్మసీలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించానని, ఆరునెలల వ్యవధిలో ఆ ప్రకటన కార్యరూపం దాల్చటం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. దీనికోసం తీవ్రంగా కృషి చేసిన రాష్ట్ర సహకారశాఖ మంత్రి పెరియకరుప్పన్‌కు ఈ సందర్భంగా సీఎం ధన్యవాదాలు తెలిపారు.

2021లో డీఎంకే అధికారంలోకి వచ్చినప్పుడు కొవిడ్ తీవ్రరూపం దాల్చిందని, ఆ వైరస్ నిరోధక చర్యలు చేపట్టి మొదటి, రెండో విడత టీకాలు, బూస్టర్ టీకాలను వేసి ప్రజలందరికీ తక్కువ కాలంలోనే ప్రాణగండం నుండి కాపాడగలిగామని చెప్పారు. ఆ తర్వాతే ప్రజలవద్దకే వైద్యం పథకాన్ని ప్రారంభించి అందరికీ వైద్యాన్ని అందించగలుగుతున్నామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫార్మసీల వల్ల బీఫామ్, డీఫామ్ చదివిన వెయ్యి మంది యువకులు ఉపాధి పొందగలిగారని తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఈ మందుల దుకాణాలకు మందులు సరఫరా చేయడానికి శీతలీకరణ సదుపాయం ఉన్న గోదాములు ఏర్పాటు చేశామని, దుకాణాల్లో మందులు కొరత ఉంటే వెంటనే గోదాము నిర్వాహకులకు కబురు చేస్తే 48 గంటల్లోగా అవి జెనరిక్ మందులైనా, ప్రాణాన్ని కాపాడే మందులైనా సరే వెంటనే సరఫరా చేస్తారని చెప్పారు. కొత్తగా ఈ మందుల దుకాణాలు ఏర్పాటు చేయనున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రూ.3 లక్షలు సబ్సిడీగా ఇస్తామని, సహకార సంఘాల ద్వారా తలా రూ.2లక్షల వంతున దుకాణం నిర్మాణ పనులకు సబ్సిడీగా ఇస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో మంత్రులు కేఆర్ పెరియకరుప్పన్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్‌చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, శాసనసభ్యులు తాయగం కవి, ఎ.వెట్రి అళగన్, పరంధామన్, ఏఎంవీ ప్రభాకర్‌రాజా, జోసెఫ్ సాముయేల్, అరవింద్‌రమేష్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్. మురుగానందం, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పి.సెంథిల్‌కుమార్, ఆహార భద్రతా వినియోగదారుల సంరక్షణ శాఖ ప్రధాన కార్యదర్శి సత్యప్రద సాహు, సహకార సంఘాల రిజిస్ట్రార్ కే నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.





రాయపేట కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పళనిస్వామి - జయలలిత, ఎంజీఆర్ విగ్రహాలకు ఈపీఎస్ నివాళి

ఘనంగా జయ 77వ జయంతి

● వాడవాడలా సంక్షేమ సహాయాల పంపిణీ

ప్యారీస్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతి వేడుకలను సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కోలాహలంగా జరుపుకున్నారు. అన్నాడీఎంకే శ్రేణులు పేదలకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున మెరీనా బీచ్ రోడ్డులో జయ స్మారక ప్రాంగణంలోని ఆమె విగ్రహానికి అధికారులు ఘనంగా నివాళులర్పించారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగై ప్రాంగణంలో ఉన్న జయలలిత, ఎంజీఆర్ విగ్రహాలకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పూలమాల వేసి అంజలి ఘటించారు. ప్రత్యేకంగా చేయించిన 77 కిలోల కేక్‌ను ఈపీఎస్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ వేడుకల్లో పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్‌హుస్సేన్, ఉప ప్రధాన కార్యదర్శి కేపీ మునుస్వామి, మాజీ మంత్రులు దిండుగల్ శ్రీనివాసన్, పొన్నయ్యన్, డి.జయకుమార్, ఎస్పీ.వేలుమణి, ఆర్బీ.ఉదయకుమార్, పి.బెంజిమెన్, వలర్మతి, నత్తం విశ్వనాథన్, కడంబూర్ రాజు, ప్రిసీడియం కార్యదర్శి రాయపురం మనో, జిల్లా కార్యదర్శులు, మాజీ ఎంపీలు సహా మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో అత్యాచారాలకు పాల్పడిన నిందితులకు కఠినశిక్ష విధించాలని పళనిస్వామి డిమాండ్ చేశారు. 1991 నుంచి 96వ సంవత్సరం వరకు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జయలలిత మహిళల భద్రత, సంక్షేమం కోసం ఎన్నో పథకాలతో పాటు మహిళా కమాండో దళాలు పరిచయం చేశారని ఇందువల్ల రాష్ట్రంలో ఆడశిశువుల హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఈ పథకాలను ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ అటకెక్కించినందువల్ల రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెరిగాయని, దీనికి పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

జయ కీర్తి సుస్థిరం: అన్నామలై

ప్రజల సంక్షేమం కోసం మంచి పథకాలు విజయవంతంగా అమలు పరచిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత కీర్తి సుస్థిరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కొనియాడారు. ఆయన సోమవారం తన ఎక్స్ పేజీలో... ముఖ్యమంత్రిగా, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన జయలలిత జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పారని, అత్యుత్తమమైన జాతీయవాదిగా చరిత్రలో నిలిచిపోయారని కీర్తించారు.

'అమ్మ' అని పిలిపించుకున్న నాయకురాలు: టీటీవీ దినకరన్

రాజకీయాల్లో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని ఛేదించి ప్రజల పక్షాన నిలిచిన మాజీ ముఖ్యమంత్రి జయలలిత ప్రజలచే 'అమ్మ' అని పిలుపించుకుని చరిత్రలో నిలిచిపోయారని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పేర్కొన్నారు.

అన్నాడీఎంకే నాదే: ఓపీఎస్

పార్టీ అపజయాలకు ఏకనాయకత్వమే కారణం

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జయలలిత మృతి తర్వాత, ఎన్నడూ లేని విధంగా అన్నాడీఎంకే వరుస ఓటములు చవిచూడటానికి ఆ పార్టీలో కొనసాగుతున్న ఏక నాయకత్వమే కారణమని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) అన్నారు. జయ జయంతి సందర్భంగా మెరీనాబీచ్ కామరాజర్‌రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, చిత్రపటానికి ఓపీఎస్, ఆయన అనుచరులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఓపీఎస్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా మళ్ళీ జయ పాలన రావాలని కోరుకుంటున్నారని, ఆమె బ్రతికున్నంతవరకూ పార్టీని ఉన్నతస్థితికి చేర్చారని, ఆ తర్వాత పార్టీలో ద్వంద్వ నాయకత్వం ఉన్నప్పుడు బలం బాగా పుంజుకుందన్నారు. ఏకనాయకత్వం వచ్చినప్పటి నుండి పార్టీ ప్రతిష్ఠ క్రమంగా తగ్గుతూ వస్తోందన్నారు. పార్టీలోని సీనియర్ నేతలంతా పార్టీ నాశనమైనా పరవాలేదు గానీ, ఏకనాయకత్వమే కావాలని కోరుకుంటున్నారని, ఇది మంచిది కాదన్నారు. పార్టీలో నిరంకుశధోరణి పెరుగుతున్నాయన్నారు. పార్టీ నుంచి విడిపోయినవారిందరినీ కలుపుకుని అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే అన్నాడీఎంకే గెలిచి అధికారంలోకి వస్తుందని, అయితే ఈ దిశగా పార్టీ నాయకులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గర్హనీయమని ఓపీఎస్ వ్యాఖ్యానించారు.



జయ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి నివాళు లర్పిస్తున్న పన్నీర్‌సెల్వం తదితరులు

టీవీకే వార్షికోత్సవాలకు సమన్వయ కమిటీ

● పుదువై సీఎం రంగస్వామికి ఆహ్వానం



చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం వార్షికోత్సవాల నిర్వహణ కోసం 18 మందితో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ నేత, సినీ నటుడు విజయ్ ప్రకటించారు. ఈ నెల 26న మహాబలిపురంలో జరిగే వార్షికోత్సవాలకు జాతీయ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్‌కిషోర్, పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సమన్వయ కమిటీలో చెంగల్పట్టుకు చెందిన సూర్యనారాయణన్, ఎంజీకే మోహన్‌రాజా, ఎంఎస్ బాలాజీ, వీ నరేంద్రన్, తిరుప్పోరూరుకు చెందిన సీవీ దీనా, వీకేఆర్ త్యాగు, ఎం.రాజేశ్, వి.రమేష్, ఎస్.సుకి గణేష్, కె.దేవా, ఎస్.విశ్వనాథన్, వి.హేమ, వి.విజయదేవి, ఎస్.పుష్పరాజ్, పి.భవానీ, కె.గౌతమ్, కె.కన్నన్, మధురాంతకంకు చెందిన ఎస్.జాన్ రాజేష్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. పార్టీ ప్రారంభించి యేడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించే వేడుకలో లక్షలాదిమంది కార్యకర్తలు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించి పనయూరులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం రాత్రంతా పార్టీ నాయకులతో విజయ్ చర్చలు జరిపారు. అదే సమయంలో పార్టీ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనేవారికి పాస్‌లు కూడా అందజేశారు. ఈ వేడుకల్లో పార్టీ సర్వసభ్యమండలి, కార్యాచరణ మండలి సమావేశాల తేదీలను కూడా విజయ్ ప్రకటించనున్నారు.

విజయ్ పార్టీతో పొత్తుపై పరిశీలన: రంగస్వామి

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ఆర్ కాంగ్రెస్ తమిళనాట ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలతో పొత్తు కుదుర్చుకోవటం ఖాయమేనని ఆ పార్టీ నేత, పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి తెలిపారు. సోమవారం ఉదయం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... తమిళగ వెట్రి కళగం ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తనకు చిరకాల స్నేహితుడని, పార్టీ నేత విజయ్‌తో కూడా పరిచయాలు న్నాయని చెప్పారు. ఎన్ఆర్‌కాంగ్రెస్‌కు తమిళనాట కూడా స్పందన వస్తోందని, ఇటీవల వేలూరుకు చెందిన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీలో చేరారని తెలిపారు. పార్టీ శ్రేణుల చిరకాల కోరిక మేరకే తమిళనాట ఈసారి కొన్ని పార్టీలతో పొత్తుపెట్టుకుంటామన్నారు. విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రికళగంతో పొత్తుపై ఎన్నికలు సమీపించే కాలంలో నిర్ణయం తీసుకుంటామన్నారు.



సోమవారం న్యూఢిల్లీలో రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయిన రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి

రససూర్ఫ్తిని కలిగించేది శబ్దశక్తి

● డాక్టర్ కాసల నాగభూషణం

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కవికి వున్న ఆయుధం వాక్కు అని, మనలో రససూర్ఫ్తిని కలిగించినది శబ్ద శక్తి అని, దానినే రసధ్వని అంటారని ప్రముఖ కవి విమర్శకులు, డీజీ వైష్ణవ కళాశాల విశ్రాంత తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ కాసల నాగభూషణం పేర్కొన్నారు. సోమవారం మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాల తెలుగు విభాగం ఎండోమెంట్ ప్రసంగాల్లో భాగంగా 'కావ్యం-రసానుభవం' అనే అంశంపై డాక్టర్ కాసల ప్రసంగించారు. తెలుగుశాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.ఎలిజబెత్ జయకుమారి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నాగభూషణం రససిద్ధి, రసనిష్ఠ, రసరాజ్యం నవరసాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతాచార్యులు లింగమనేని బసవశంకరరావు, ఆయన సతీమణి రచయిత్రి సుజాత, మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు, ప్రెసిడెన్సీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడి మురళి, డాక్టర్ పాండురంగం కాళియప్ప, డాక్టర్ మాదా శంకరబాబు, డాక్టర్ ఆముక్తమాల్యద, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థిని అనురాధ వందన సమర్పణతో సభ ముగిసింది.



డాక్టర్ కాసలను సత్కరిస్తున్న నిర్వాహకులు



టి.నగర్‌లోని పద్మావతి ఆలయ బ్రహ్మోత్సవాలో భాగంగా అమ్మవారు సోమవారం కల్కి అలంకారంలో అశ్వవాహనంపై దర్శనమిచ్చారు.

బాణసంచా గోదాములో పేలుడు

ముగ్గురు మహిళల సజీవ దహనం

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి సమీపంలోని బాణసంచా గోదాము లో సంభవించిన అగ్నిప్రమాదంలో ముగ్గురు మహిళలు సజీవ దహనమయ్యారు. ధర్మపురి జిల్లా వేదారంపట్టి పంచాయతి చిన్నమురుక్కపట్టి రాశిపురంలో చిన్నదురైకు బాణసంచా గోదాము ఉంది. ఈ గోదాములో చెంబగం (35), తిరుమలర్ (38), తిరుమంజు (33) సహా నలుగురు మహిళలు సోమవారం యధావిధిగా విధుల్లోకి వచ్చా రు. వారిలో ఒక మహిళ మధ్యాహ్నం భోజనం కోసం బయటకు వెళ్లింది. ఆ సమయంలో హఠాత్తుగా పేలుడు పదార్థాలు భారీ శబ్దంతో పేలిపోయాయి. ఈ ఘటనలో గోదాములోని ఓ గది పూర్తిగా కూలింది. బయటకు రాలేకపోయిన చెంబగం, తిరుమలర్, మంజులు ఘటనా స్థలంలోనే సజీవ దహనమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేసి, గోదాము శిధిలాల నుంచి మృతదేహాలు వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించిన కంబైనల్లూర్ పోలీసులు, ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ మహేశ్వరన్ పరిశీలించారు



మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు: సీఎం

ధర్మపురి జిల్లాలో బాణసంచా ప్రమాదంపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... బాణసంచా ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, వారికి తలా రూ.4 లక్షలు అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు. కాగా, బాణసంచా ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతిచెందడంపై కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుందగై, పీఎంకే ప్రధాన కార్యదర్శి డా.అన్బుమణిలు వేర్వేరు ప్రకటనలో సంతాపం తెలిపారు.

పవర్‌హౌస్ మెట్రో రైల్వేస్టేషన్
నిర్మాణపనుల ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న రెండో విడత మెట్రో ప్రాజెక్టులో భాగంగా, పూందమల్లి-బైపాస్-లైట్ హౌస్ వరకు నాలుగో మార్గంలో కోడంబాక్కం ప్రాంతంలోని పవర్‌హౌస్ వద్ద మెట్రో ఫ్లైఓవర్‌పై రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈమార్గంలో లైట్ హౌస్ నుంచి కోడంబాక్కం ఫ్లైఓవర్ వరకు సొరంగమార్గం, పవర్‌హౌస్ నుంచి పూందమల్లి బైపాస్ వరకు స్తంభాలపై మెట్రో రైలు మార్గం ఏర్పాటవుతోంది. ఈమార్గంలో పలు ప్రాంతాల్లో రైలుపట్టాలు, రైల్వేస్టేషన్ల ఏర్పాటు ముమ్మరంగా జరుగుతోంది. అందులో భాగంగా కోడంబాక్కం పవర్‌హౌస్ ప్రాంతంలో మెట్రో రైల్వే స్టేషన్ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ విషయమై సీఎంఆర్ఎల్ అధికారి ఒకరు మాట్లాడుతూ... లైట్ హౌస్-పూందమల్లి మార్గంలో మెట్రో పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయన్నారు. ఈ మార్గంలో 30 రైల్వేస్టేషన్లు ఏర్పాటు కానున్నాయని తెలిపారు.



అందులో కోడంబాక్కం పవర్ హౌస్ ప్రాంతంలో స్తంభాలపై రైల్వే స్టేషన్ నిర్మాణం ప్రాంభించామన్నారు. ఈ స్టేషన్‌లో నాలుగు లిఫ్టులు, 9 ఎస్కలేటర్లు సహా అన్ని వసతులుంటాయన్నారు. పూందమలి-లైట్ హౌస్ మధ్య 55 శాతం పనులు పూర్తయ్యాయని, ఈ ఏడాది చివరికి పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

సమాచార దర్శిని

1 వరకు ఆర్‌ఆర్‌బీ గ్రూప్-డి పోస్టులకు దరఖాస్తులు

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేలో గ్రూప్-డి పోస్టు భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు రాతపరీక్ష నిర్వహిస్తోంది. చెన్నై మండలంలో 2,694 పోస్టులు సహా దేశవ్యాప్తంగా 32,438 గ్రూప్-డి పోస్టులు భర్తీ చేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు మార్చి1వతేది లోపు https://www.rrbchennai.gov.in / అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌ఆర్‌బీ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రపంచ బ్యాంక్ నిధులతో అభివృద్ధి

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీల్లో 2030లోగా తాగునీరు, భూగర్భ డ్రైనేజీ పనులను ప్రపంచ బ్యాంక్ నిధులతో చేపట్టనున్నట్లు నగరపాలక నిర్వహణ శాఖ అధికారులు తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 'తమిళనాడు క్లైమేట్ ఛేంజ్ అడాప్టేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ప్రారంభించింది. ఈ ప్రాజెక్ట్ రూ.3,838 కోట్లతో చేపట్టేందుకు 2023లో ప్రపంచ బ్యాంక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ప్రాజెక్ట్ వ్యయంలో రూ.2,940 కోట్లు ప్రపంచ బ్యాంక్, రూ.637 కోట్లు స్థానిక సంస్థలు భరించనున్నాయి. ఈ పనులకు 2030 సంవత్సరానికి పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

టెర్రస్ గార్డెన్, సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యవసాయం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో టెర్రస్ గార్డెన్, సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ ఇవ్వనున్నారు. గిండిలోని వర్సిటీ సమాచార, శిక్షణ కేంద్రంలో ఈ నెల 27వ తేది టెర్రస్ గార్డెన్, 28న సేంద్రియ పద్ధతిలో కాయగూరలు, పండ్ల సాగుపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో రైతులు, మహిళలు, యువతీ యువకులు, స్వయం సహాయక బృందాలు, చిరు వ్యాపారులు పాల్గొనవచ్చు. ఆసక్తి ఉన్న వారు 044-29530048 అనే నెంబరు సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలని వర్శిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

పరీక్షా కేంద్రం ప్రాంగణంలోకి తల్లిదండ్రులకు అనుమతి

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 15 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. మీనంబాక్కంలోని కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రానికి పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరవుతున్నారు. విద్యార్థులు తీసుకొచ్చే తల్లిదండ్రులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన పాఠశాల యాజమాన్యం, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రాంగణంలో వాహనాలు నిలిపేందుకు అనుమతించింది.

28లోపు ఎంబీబీఎస్ అడ్మిషన్ల వివరాలు

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా ఎంబీబీఎస్ కోర్సుల్లో చేరిన విద్యార్థుల వివరాలు ఈ నెల 28వ తేది లోపు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని జాతీయ వైద్య మండలి (ఎన్‌ఎంసీ) ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఎన్‌ఎంసీ విడుదల చేసిన ప్రకటనలో... ఎంబీబీఎస్ కోర్సుల్లో అడ్మిషన్లు పారదర్శకంగా చేపట్టామన్నారు. ఎంబీబీఎస్ లో చేరిన విద్యార్థుల వివరాలను ఎన్‌ఎంసీ వెబ్‌సైట్‌లో డిసెంబరు 19వ తేదీతో అప్‌లోడ్ పూర్తయ్యాయన్నారు. అనంతరం ఖాళీ సీట్లకు నిర్వహించిన ప్రత్యేక కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థుల పేర్లు, కేటాయింపు, ఫీజు తదితర వివరాలను ఈ నెల 28వ తేదిలోపు అప్‌లోడ్ చేయాలని ఎన్‌ఎంసీ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళన తాత్కాలిక విరమణ

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మంత్రులతో చర్చలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రభుత్వ ఉద్యోగులు ప్రకటించిన ఆందోళన తాత్కాలికంగా విరమించుకున్నారు. ఖాళీ పోస్టుల భర్తీ, కాంట్రాక్ట్ కార్మికుల పోస్టుల క్రమబద్ధీకరణ, పాత పింఛన్ విధానం అమలు సహా పది డిమాండ్ల సాధనకు ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ ఉద్యోగుల కోర్కెలు పరిష్కరించేలా వారితో చర్చించేందుకు మంత్రులతో కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించడంతో, తమ ఆందోళన తాత్కాలికంగా విరమించుకుంటున్నట్లు ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు.

వైగై డ్యామ్ నుండి ఆగిన సాగునీరు

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి సమీపంలోని 71 అడుగుల ఎత్తు కలిగిన వైగై డ్యామ్ నుండి సాగుజలాలను నీటివనరుల శాఖ అధికారులు సోమవారం ఉదయం నుండి నిలిపేశారు. ప్రస్తుతం ఆ డ్యామ్ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు ఆగిపోవడంతో డ్యామ్‌లో నీటి మట్టం క్రమంగా తగ్గుతోంది. దీంతో నీటివనరులశాఖ అధికారులు సాగుజలాలను నిలిపివేశారు. అదే సమయంలో మదురై నగరవాసుల కోసం తాగునీటిని మాత్రం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో 3995 మిలియన్ ఘనపుటడుగుల జలాలు మాత్రమే ఉన్నాయి.

జ్ఞానశేఖర్ కేసులో చార్జిషీటు దాఖలు

● సైదాపేట కోర్టుకు అందజేసిన సిట్

అడయార్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై జరిగిన లైంగికదాడి కేసులో ప్రధాన నిందితుడైన జ్ఞానశేఖరన్‌పై సిట్ తయారుచేసిన చార్జిషీటును సైదాపేట కోర్టులో సోమవారం దాఖలు చేసింది. ఈ కేసులో జ్ఞానశేఖరన్ మాత్రమే నిందితుడని శాస్త్రీయంగా చెన్నై నగర పోలీసులు నిర్ధారించిన విషయమే సిట్ దర్యాప్తులో కూడా తేలింది. గత యేడాది డిసెంబరు 24వ తేదీ అన్నావర్సిటీలో ఈ లైంగికదాడి జరిగింది. ఈ కేసులో జ్ఞానశేఖరన్‌ను నగర పోలీసులు అరెస్టు చేశారు. ఆతర్వాత మద్రాస్ హైకోర్టు ఆదేశం మేరకు ప్రభుత్వం ఈకేసు విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. ఈనేపథ్యంలో రెండు నెలలుగా జైలులో ఉన్న నిందితుడిని సిట్ విచారించింది. అలాగే, సిట్ సేకరించిన సాక్ష్యాధారాలతో చార్జిషీటు తయారు చేసి, సోమవారం ఉదయం సైదాపేట కోర్టుకు సమర్పించింది.

విద్యార్థి నడిపిన కారు ఢీకొని మహిళ మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థి నడిపిన కారు ఢీకొని మహిళ మృతిచెందింది. కాంచీపురం కార్పొరేషన్ పరిధిలోని పెద్ద కాంచీపురం ప్రాంతానికి చెందిన సరస్వతి(57) ఆదివారం ఉదయం తన ఇంటిముందు ముగ్గు వేస్తోంది. ఆ సమయంలో అదే ప్రాంతంలో తన కారు స్టార్ట్ చేసిన ఓ వ్యక్తి, ప్లస్ టూ చదువుతున్న తన 17 ఏళ్ల కుమారుడితో కలసి కారు శుభ్రం చేస్తున్నాడు. ఆ సమయంలో ఆ విద్యార్థి హఠాత్తుగా కారు నడపంతో రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళ్లిన కారు ముగ్గు వేస్తున్న సరస్వతిని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందింది. సమాచారం అందుకున్న శివకాంచి పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదుచేసి తండ్రీకొడుకులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

బాలికపై అత్యాచారం
మతబోధకుడి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చర్చికి వచ్చిన 13 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన మతబోధకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కన్నియాకుమారి జిల్లాకు చెందిన మత బోధకుడు ఓ ప్రాంతంలో చర్చి నడుపుతున్నాడు. ప్రార్థనలకు చర్చికి వస్తున్న 13 ఏళ్ల బాలికను అతడు బెదిరించి అత్యాచారానికిపాల్పడినట్లు సమాచారం. కొద్దిరోజులుగా బాలిక కడుపు నొప్పితో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్ష చేసి బాలిక అత్యాచారానికి గురైనట్లు తెలిసింది. బాలిక ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, కుటుంబంతో కలిసి కోవైలో అజ్ఞాతంలో ఉన్న మతబోధకుడిని ఆదివారం అరెస్ట్ చేశారు. అలాగే అతడికి సహాయంగా ఉన్న ఆయన భార్య, కుమారుడిని కూడా అరెస్ట్ చేశారు.

కబడ్డీ ఆడుతూ క్రీడాకారుడి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ ఆడుతున్న క్రీడాకారుడు మైదానంలోనే కుప్పకూలి మృతిచెందడం విషాదం నింపింది. పుదుకోట జిల్లా పిచ్చాంతన్‌పట్టి గ్రామానికి చెందిన శివగణేష్ (54) ఓ పాఠశాలలో కర్రసాము మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు కబడ్డీ ఇష్టం దీంతో కబడ్డీ పోటీలకు వెళ్తుంటాడు. శివగంగ జిల్లా పట్టమంగళంలో ఆదివారం 45 ఏళ్ల పైబడిన వారికి కబడ్డీ పోటీలు నిర్వహించగా, 12 జట్లు పాల్గొన్నాయి. ఆ జట్లలో శివగణేష్ జట్టు కూడా ఉంది. పోటీ జరుగుతున్న సమయంలో శివగణేష్ హఠాత్తుగా స్పృహ కోల్పోయాడు. సహచర క్రీడాకారులు అతనికి వెంటనే ప్రాథమిక చికిత్స చేసి తిరుపత్తూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, అప్పటికే అతను మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో పోటీలు మధ్యలోనే నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కాలేజీ విద్యార్థుల అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కోయంబత్తూరులో ఇంటి మేడపై గంజాయి మొక్క పెంచిన కేసులో నలుగురు కాలేజీ విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. కులియముత్తూరు, కోవైపుదూర్ తదితర ప్రాంతాల్లో అనేక మంది విద్యార్థులు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. వీరిలో అనేక మంది మత్తుపదార్థాలకు బానిసవుతున్నారు. స్థానికంగా ఒక ప్రైవేటు కాలేజీలో చదువుతూ అద్దె ఇంటిలో ఉంటున్న ఓ విద్యార్థి ఇంటి మేడపై గంజాయి మొక్క పెంచుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ఇంటిలో తనిఖీలు చేయగా, గంజాయి మొక్కను గుర్తించి ఆ ఇంటిలో ఉండే నలుగురు విద్యార్థులను అరెస్టు చేశారు.

పట్టాలు తప్పిన రైలింజన్



పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్ సమీపంలో గూడ్సు రైలింజన్ పట్టాలు తప్పింది. కొత్త రైల్వే మార్గం ఏర్పాటుకు తిరువారూర్ రైల్వేస్టేషన్ నుంచి ఆదివారం ఉదయం కంకరరాళ్లతో కూడిన 12 బోగీలతో కూడిన గూడ్సు రైలు కారైక్కాల్ వైపు బయల్దేరింది. కొద్దిదూరం వెళ్లిన తర్వాత రైలింజన్ చక్రాలు పట్టాలు తప్పాయి. సమాచారం అందుకొని అక్కడకు చేరకున్న అధికారులు, సిబ్బంది రైలింజన్ను తిరిగి పట్టాలపై నిలిపే పనులు చేపట్టారు. ముందుగా బోగీలను రైలింజన్ నుండి తప్పించి మరో ఇంజన్‌కు జతచేసి కారైక్కాల్‌కు పంపించారు.

భారత జట్టుకు సీఎం శుభాకాంక్షలు

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ పోటీల్లో పాకిస్తాన్‌పై విజయం సాధించిన భారత జట్టుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో... ఈ పోటీల్లో సెంచరీ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విరాట్ కోహ్లీకి అభినందనలు. ఇదే ఉత్సాహంతో ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంటామని సీఎం ట్వీట్ చేశారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో నిషేధిత ప్రాంతంలో సెల్ఫీ తీసుకొనేందుకు యత్నించిన యువకుడు, అలల్లో చిక్కుకొని మృతిచెందాడు. సేలం జిల్లా మరమంగళంకు చెందిన 27 మంది బృందం ఆదివారం నాగర్‌కోయిల్ జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం కన్నియాకుమారి విహారయాత్రకు వెళ్లారు. వారిలో విజయ్ (27) అనే యువకుడు సహా పలువురు గాంధీ మండపం వెనుక వైపున్న నిషేధిత 'మరణ్ పారై' అనే ప్రాంతానికి వెళ్లారు. భారీ రాళ్లతో కూడిన ఆ ప్రాంతంలో విజయ్ సెల్ఫీ తీసుకొనే సమయంలో హఠాత్తుగా వచ్చిన అలల్లో చిక్కుకున్నాడు. సమాచారం అందుకున్న తీర ప్రాంత భద్రతా దళం ఆ ప్రాంతానికి వెళ్లి గాలించినా



ప్రాణం తీసిన ప్రాంతం (అంతర్ చిత్రంలో) మృతుడు విజయ్ (ఫైల్ ఫోటో)

విజయ్ ఆచూకీ తెలియలేదు. ఈ నేపథ్యంలో, అలల్లో చిక్కుకున్న విజయ్ మృతదేహం సోమవారం టవర్ అనే ప్రాంతంలో తీరానికి కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సమ్మె ప్రారంభించిన రామేశ్వరం జాలర్లు

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం జాలర్లు ప్రకటించిన నిరవధిక సమ్మె సోమవారం ప్రారంభమైంది. చేపల వేటకు సముద్రంలోకి వెళ్తున్న రాష్ట్ర జాలర్లను సరిహద్దులు దాటారంటూ శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేస్తున్న ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా, చేపల వేటకు వెళ్లిన 32 మంది రామేశ్వరం జాలర్లను ఆదివారం లంక నావికాదళం అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలో, శ్రీలంక నావికాదళం అమానుషదాడులు ఆపాలని, శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లు, వారి పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దేశ ప్రభుత్వంతో చర్చలు జరపాలనే డిమాండ్‌తో రామేశ్వరం జాలర్లు నిరవధిక సమ్మెకు పిలుపినిచ్చారు. సమ్మె కారణంగా సుమారు 700లకు



తీరంలో నిలిచిన పడవలు

పైగా పడవలు తీరంలోనే నిలిచిపోగా, సుమారు 10,000 మంది జాలర్లు సమ్మెలో పాల్గొన్నారు.

తోటలోకి ప్రవేశించిన మొసలి పట్టివేత

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిదంబరం సమీపంలో తోటలో ప్రవేశించిన 13 అడుగుల మొసలిని అటవీ సిబ్బంది బంధించారు. కడలూరు జిల్లా చిదంబరం సమీపం అమ్మాపేటకు చెందిన సంబంధమూర్తి తన తోటలో ఆదివారం ఉదయం భారీ మొసలి సంచరించడం గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడకు చేరుకొని 13 అడుగులున్న మొసలిని బంధించి వక్కిరమారి నదిలో విడిచిపెట్టారు.

కుమరి పశ్చిమ కనుమల్లో అగ్నిప్రమాదం

● కళాశాలకు రెండు రోజుల సెలవు

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా ఇరణి సమీపం సౌరంగకడె పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల దిగువన ఉంది. ఈ ప్రాంతంలో ఎయిడెడ్ మహిళా కళాశాల పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో, ఈ కొండ ప్రాంతంలో సోమవారం వేకువజామున మంటలు చెలరేగాయి. ఆ సమయంలో గాలి వేగం అధికంగా ఉండడంతో మంటలు ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. మంటలు కళాశాలకు కూడా వ్యాపించే అవకాశముందని అటవీ శాఖ హెచ్చరికలతో, కళాశాలకు రెండు రోజులు సెలవులు ప్రకటించారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులను హుటాహుటిన వారి స్వగ్రామాలకు పంపించారు. మంటలు అదుపుచేసేందుకు అటవీ, అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్నారు.

తిరుపత్తూర్‌లో చేపలు పట్టే వేడుకలు



పట్టుబడిన చేపలతో చిన్నారులు

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుపత్తూర్ పంచాయతి పరిధిలోని సిరుకుడి చెరువులో ఆదివారం చేపలు పట్టే వేడుకలు కోలాహలంగా సాగాయి. వేసవి సీజన్ ప్రారంభమయ్యే సమయంలో ఈ గ్రామంలో చేపలు పట్టే వేడుకలు నిర్వహిస్తుంటారు.. తొలుత గ్రామదేవతకు పూజలు నిర్వహించిన గ్రామస్తులు, చేపలు పట్టే వేడుకల్లో ఎలాంటి ఇబ్బంది కలగకూడదని గ్రామ దేవతను వేడుకున్నారు. అనంతరం గ్రామ పెద్దలు జెండా ఊపడంతో అప్పటికే సిద్ధంగా ఉన్న ప్రజలు ఒక్కసారిగా చెరువులో దిగి చేపలు పట్టారు. చిన్నారులు సైతం పాల్గొని భారీగా చేపలు పట్టుకొని ఆనందంగా ఇళ్లకు వెళ్లారు.

త్రిభాషా విధానాన్ని చొప్పించలేరు

- మంత్రి పొన్ముడి

అడయార్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్రిభాషా విధానాన్ని ఏ ఒక్కరు కూడా చొప్పించలేరని రాష్ట్ర మంత్రి డాక్టర్ పొన్ముడి అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్ర వ్యాప్తంగా 1000 సీఎం ఫార్మసీలను ప్రారంభించారు. ఇందులో భాగంగా విల్లుపురంలో ఏర్పాటు చేసిన 23 సీఎం ఫార్మసీలను మంత్రి పొన్ముడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్రిభాషా విధానానికి తాము వ్యతిరేకమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులను నిలిపివేసినా తాము మాత్రం ద్విభాషా విధానానికే కట్టుబడతామని సీఎం స్టాలిన్ ఇప్పటికే ప్రకటించారని ఆయన గుర్తుచేశారు.

ధనుష్కోడికి
నలుగురు శరణార్థులు

అడయార్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలోని ధనుష్కోడికి శ్రీలంక నుంచి నలుగురు శరణార్థులు చేరుకున్నారు. వీరిలో ఓ జంటతో పాటు వారి ఇద్దరు పిల్లలున్నారు. వీరిని విచారించేందుకు మెరైన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రామేశ్వరం సమీపంలోని ధనుష్కోడి అరిచ్చల్ మునై ప్రాంతంలో నలుగురు బ్యాగులతో ఉన్నట్లు జాలర్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు వెళ్లి శరణార్థులను స్టేషన్‌కు తరలించి విచారించగా, శ్రీలంకలోని వావునియా ప్రాంతానికి చెందిన కలైసెల్వన్ (37), ఈయన భార్య కృపానా (35), జీవన్ (7), చార్విన్ (5)గా గుర్తించారు. ఆ తర్వాత వారిని మెరైన్ పోలీసులకు అప్పగించగా, వారు మండపంలోని మెరైన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మలేసియా వెళ్లిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 52 మంది ఆదివారం విద్యా విహారయాత్రకు మలేసియా వెళ్లారు. విద్య, ఇతర అంశాల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను ఎంపిక చేసి, ప్రపంచ స్థాయి, దేశీయ, రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధిచెందిన ప్రాంతాలకు విద్యా విహారయాత్ర కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ చేపట్టింది. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన 52 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు, సిబ్బంది మొత్తం 56 మంది ఆదివారం మంత్రి అన్బిల్ మహేష్ నేతృత్వంలో నగరం నుంచి విమానం ద్వారా మలేసియా వెళ్లారు. అక్కడ పుత్రాజయ టూరిజం, యూనివర్సిటీ టూరిజం, కేఎస్ టవర్, కేఎల్ సిటీ, చాకొలేట్ మ్యూజియం, తమిళ సంగమం సమావేశం, బట్టు గుహ మురుగన్ ఆలయం, జెంటింగ్ ఐస్‌లాండ్ తదితర ప్రాంతాలు వీక్షించి, ఈ నెల 28న నగరానికి తిరిగి వస్తారని అధికారులు తెలిపారు.

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యా యత్నం

అడయార్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలి కలెక్టర్ కార్యాలయంలో ఓ మహిళ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న పోలీసులు ఆమెను రక్షించడంతో ప్రాణాపాయం తప్పింది. తమ ఆస్తులను కుటుంబ సభ్యులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితురాలిని వళ్ళి (48)గా గుర్తించారు. ఆ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

అగ్నిప్రమాదాలు జరగకూడదని అటవీ శాఖ పూజలు

పెరంబూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకూడదని కోరుకుంటూ అటవీ శాఖ అధికారులు మారియమ్మన్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నీలగిరి జిల్లా ముదుమలై పులుల శరణాలయంలో కరువు తీవ్రత అధికంగా కనిపిస్తోంది. ఎండకు చెట్లు ఎండిపోవడం, పచ్చటి ప్రాంతాలన్నీ బీడుభూములుగా దర్శనమిస్తున్నాయి. అదే సమయంలో ఎండ తీవ్రత కారణంగా అడవుల్లో తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. అగ్నిప్రమాదాలు నివారించేందుకు అటవీ శాఖ ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. ఈ పనులు ప్రారంభించే ముందు రోడ్డు పక్కన ఉన్న దండు మారియమ్మన్ ఆలయంలో గిరిజన సంప్రదాయం ప్రకారం అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పొంగళ్లుపెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక పూజల్లో అధికారులు, సిబ్బంది

ఈ విషయమై మసినకుడి రేంజర్ బాలాజీ మాట్లాడుతూ... ప్రతి ఏటా అగ్నిప్రమాదాలను అరికట్టేందుకు ముందు జాగ్రత్తచర్యలు ప్రారంభించే సమయంలో మారియమ్మన్‌కు పూజలు చేస్తున్నట్టు తెలిపారు.

తల్లి నగలు కుదువపెట్టి
విద్యుత్ బిల్లులు చెల్లించాం

● మంత్రి దురైమురుగన్

అడయార్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలకు ఒకసారి చెల్లించే విద్యుత్ బిల్లుల కోసం తన తల్లి నగలను కుదువపెట్టి కరెంట్ చార్జీలను చెల్లించినట్టు రాష్ట్ర నీటి పారుదల శాఖామంత్రి దురైమురుగన్ తెలిపారు. రాణిపేట జిల్లా వాలాజాబాద్, కాట్పాడి నియోజకవర్గంలో రూ.2.3 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, ఇపుడు రాష్ట్ర నీటి పారుదల శాఖామంత్రిగా ఉండటంతో రాష్ట్రంలోని జలవనరుల వివరాలపై పూర్తి అవగాహన రావడంతో పాటు వాటిలో పూడికతీత తీయిస్తున్నట్టు వెల్లడించారు. తాను ఎక్కడ ఉన్నా నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అదేసమయంలో రైతులతో సత్సంబంధాలున్నట్టు చెప్పారు. ఎందుకంటే తానే ఒక రైతునేనని, ప్రతి రైతు కష్టం తనకు తెలుసన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలోనే రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చినట్టు వెల్లడించారు. తమకు వ్యవసాయ పంపు సెట్ ఉండేదని, దాని కరెంట్ బిల్లు చెల్లించేందుకు కూడా డబ్బులుండేవి కావన్నారు. అందుకే తన తల్లి నగలను ఒక్కొక్కటిగా కుదువపెట్టి ప్రతి రెండు నెలలకు ఒకసారి విద్యుత్ బిల్లులు చెల్లించినట్టు వెల్లడించారు.

జయ జయంతి వేడుకలకు సెంగోట్టయ్యన్ దూరం

అడయార్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి వేడుకలను ఆ పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అయితే, నగరంలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు ఆ పార్టీ సీనియర్ నేతల్లో ఒకరైన మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ దూరంగా ఉన్నారు. ఇది అన్నాడీఎంకే శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. కానీ, ఈరోడ్ జిల్లా గోబిశెట్టిపాళెయంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఆయన మాట్లాడుతూ అన్నాడీఎంకే పటిష్టమైనదని, వచ్చే యేడాది జరిగే ఎన్నికల్లో ఎంజీఆర్, జయలలిత ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. చెన్నైలో జరిగిన వేడుకల్లో పాల్గొనకపోడానికి ఓ కారణం ఉందన్నారు. జయలలిత సంస్మరణ సభ అయితే ఖచ్చితంగా పాల్గొని ఉండేవాడినని, కాని ఇవి జయంతి వేడుకలని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు తన నియోజకవర్గంలో కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

పుళల్ కావాంగరైలో ఘనంగా జయ జయంతి



జయలలిత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎం.సుందర్, నరసింహారెడ్డి, లయన్ జి.మురళి తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ కావాంగరైలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతి ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎం.సుందర్, నరసింహారెడ్డి, లయన్ జి.మురళి, బాలాజి, గురవయ్య తదితరులు పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం ఆ ప్రాంతంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, విద్యార్థులకు సంక్షేమ సహాయాలు, ఆహారం పంపిణి చేశారు.

'సీఎం ఫార్మశీ' ప్రారంభం

వేలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 'సీఎం ఫార్మశీ' దుకాణాలు సోమవారం ప్రారంభ వ ు య్యా ం ు. కాట్పాడిలోని చిత్తూరు బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన సీఎం ఫార్మశీని మంత్రి దురైమురుగన్



చిత్తూరు బస్టాండ్‌లో సీఎం ఫార్మశీని ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, ఎమ్మెల్యేలు కార్తికేయన్, అమ్ములు, కార్పొరేషన్ మేయర్ సుజాత, ఉప మేయర్ సునీల్‌కుమార్, మండల కమిటీ అధ్యక్షురాలు పుష్పలత వన్నియరాజా, కో-ఆపరేటివ్ సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ తిరుగుణ అయ్యప్పదొరై, కాట్పాడి తహసీల్దార్ జగదీశ్వరన్ పాల్గొన్నారు.

ఎన్టీకే నుంచి వైదొలగిన మహిళా నేత

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు సీమాన్ నాయకత్వంలోని నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) మగళీర్ పాశరై (మహిళా విభాగం) సమన్వయకర్త కాళియమ్మాళ్ సోమవారం ఆ పార్టీ నుండి వైదొలగారు. గత వారం రోజులుగా ఆమె పార్టీకి గుడ్‌బై చెబుతారంటూ వార్తలు వచ్చాయి. ఆ విషయమై సీమాన్‌ను మీడియా ప్రశ్నించినపుడు పార్టీకి ఇది ఆకులు రాలే కాలమని, పార్టీ నుండి పాతవారు వెళ్ళి, కొత్తవారు చేరే సమయమని యెద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ నుండి భారమైన మనస్సుతో వైదొలగుతున్నట్లు కాళియమ్మాళ్ ప్రకటించారు.



కాళియమ్మాళ్

రైల్వేస్టేషన్ బోర్డుపై హిందీ అక్షరాల చెరిపివేత

తిరుత్తణి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి రైల్వేస్టేషన్‌లోని బోర్డులపై ఉన్న హిందీ అక్షరాలను డీఎంకే కార్యకర్తలు చెరిపివేశారు. తొలుత తిరువళ్లూర్ జిల్లా వెస్ట్



గోడలపై 'తమిళం వాళ్గ' అంటూ రాస్తున్న డీఎంకే శ్రేణులు

యూత్ కార్యదర్శి కిరణ్ నేతృత్వంలో కార్యకర్తలు ర్యాలీగా రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫారంపై ఉన్న బోర్డుల్లో హిందీ అక్షరాలు చెరిపివేశారు. అనంతరం వారు బయటకు వచ్చి గోడలపై 'జాతీయ విద్యా విధానం వద్దు - ద్విభాషా విధానం ముద్దు', 'తమిళం వాళ్గ' అనే వ్యాఖ్యలు రాశారు. ఈ ఘటనపై తిరుత్తణి డీఎస్పీ కాంతన్, సీఐ మదిఅరసన్‌లు విచారణ చేపట్టి, కిరణ్ సహా 30 మందిపై కేసు నమోదుచేశారు.

కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్

వేలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి మాలతి



వినతులు స్వీకరిస్తున్న మాలతి

ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెందిల్‌కుమార్, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి సుమతి, అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి అమరావతి డ్యాం జలాల విడుదల

వేకచ్చేరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా పాత ఆయకట్టు ప్రాంతాలకు మంగళవారం నుంచి మార్చి 20వ తేది వరకు అమరావతి డ్యాం నుంచి సాగు నీరు విడుదల చేయనున్నారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... అమరావతి డ్యాం నుంచి సాగు నీరు విడుదల చేయాలని రైతుల విజ్ఞప్తి మేరకు సీఎం స్టాలిన్ ఆదేశాలిచ్చారని తెలిపింది.

'డ్రాగన్' చిత్ర బృందానికి శంకర్ ప్రశంస

● రూ.100 కోట్ల దిశగా



అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన 'డ్రాగన్' చిత్ర బృందంపై ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ ప్రశంసల వర్షం కురిపించారు. గత శుక్రవారం విడుదలైన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో హిట్‌గా నిలిచింది. ఈ సినిమా చూసిన దర్శకుడు శంకర్... చిత్ర బృందాన్ని అభినందించారు. 'డ్రాగన్' మూవీ మంచి చిత్రం. మాటలు చాలా బాగున్నాయి. ప్రతి పాత్ర ఎంతో అందంగా చిత్రీకరించడంతో పాటు నిండుదనంతో ఉన్నాయి' అని పేర్కొన్నారు. మరోవైపు రూ.40 కోట్ల బడ్జెట్‌తో తీసిన ఈ చిత్రం ఇప్పటివకే రూ.35 కోట్ల మేరకు వసూలు చేసినట్టు సమాచారం. అయితే, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఈ సినిమాకు పోటీగా ఏ చిత్రం లేకపోవడంతో రూ.100 కోట్ల మేర కలెక్షన్లు వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సినిమా విడుదలైన తమిళం, తెలుగు భాషల్లో మంచి టాక్ సొంతం చేసుకుంది.

'డ్రాగన్' మూవీలో అనుపమ, ప్రదీప్

తమిళ చిత్రజ్యోతి

యథార్థ సంఘటనలతో 'వళ్లి మలై వేలన్'



'వళ్లి మలై వేలన్'లో నాగరత్నం, ఇలక్య

యథార్థ సంఘటనలతో తెరకెక్కిన చిత్రం 'వళ్లి మలై వేలన్'. ఎంఎన్ఆర్ పిక్చర్స్ పతాకంపై ఎం.నాగరత్నం నిర్మించగా ఎస్.మోహన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ద్వారా ఎం.నాగరత్నం హీరోగా పరిచయమవుతుండగా, ఇలక్య హీరోయిన్‌గా మొట్టై రాజేంద్రన్, సెంథిల్, సెంబులి జగన్, సురేందర్, ముత్తుకాళై, కావేరి, మహిమ, గణపతి ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మోహన్ మాట్లాడుతూ, ' పూర్తిగా యథార్థ సంఘటలనతో రూపొందించాము. నరసింహన్, ముత్తయ్య అనే ఇద్దరు స్నేహితులు. వీరిలో నరసింహన్‌గా వచ్చే రాజగణపతి నేల తల్లిని ప్రేమించే వ్యక్తి. ముత్తయ్య పాత్రను మొట్టై రాజేంద్రన్ పోషించారు. వీరిద్దరూ స్నేహితులైనప్పటికీ రాజకీయాల్లోకి అడుగుపెట్టగానే వీరిద్దరి మధ్య శత్రుత్వం పెరుగుతుంది. ఈ క్రమంలో పంచాయతీ సర్పంచ్ పదవికి ఈ ఇద్దరు స్నేహితులు పోటీ పడతారు. ఈ ఎన్నికల్లో ముత్తయ్యను నరసింహన్ ఓడిస్తారు. వీరిద్దరి తర్వాత వీరి వారసులుగా వేలన్, సంతోష్ పోటీ చేస్తారు. అదేసమయంలో వేలన్ ఇంటికి చెరకు పంట నరికేందుకు వళ్లి అనే యువతి వస్తుంది. వీరిద్దరి మధ్య ప్రేమ ఏర్పడుతుంది. ఈ ప్రేమను భగ్నం చేసేందుకు సంతోష్ శతవిధాలా ప్రయత్నిస్తాడు. తమ పెళ్ళికి సంతోష్ సృష్టించే అడ్డంకులను వేలన్ అధిగమించి వళ్లిని పెళ్ళి చేసుకున్నాడా? లేదా? అన్నదే ఈచిత్రకథ. వళ్లిమలై పరిసరగ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరించాం. ప్రస్తుతం తుది దశ నిర్మాణ పనులను జరుపుకుంటుంది' అని పేర్కొన్నారు.

రవి మోహన్‌కు వరుసగా అవకాశాలు



రవి మోహన్

తాను నాలుగైదు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నట్టు హీరో రవి మోహన్ చెప్పారు. నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'వేల్స్ నిర్మాణ సంస్థ నిర్మించే 'జీని' మూవీలో నటిస్తున్నాను. 'పరాశక్తి' మూవీ తొలి షెడ్యూల్ పూర్తి చేశాం. త్వరలోనే రెండో షెడ్యూల్ ప్రారంభంకానుంది. మూడో చిత్రం 'కరాటే బాబు' షూటింగ్ శరవేగంగా సాగుతుంది. గణేష్ బాబు చాలాబాగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఏప్రిల్ లేదా మే నెలలో చిత్రీకరణ పూర్తి చేస్తాం' అని వెల్లడించారు. వీటితో పాటు మరికొన్ని ప్రాజెక్టులు కూడా ఉన్నాయి' అని వెల్లడించారు.

ఒకే రోజు విడుదలవుతున్న రెండు థ్రిల్లర్ మూవీలు




'శబ్దం'లో ఆది

ఈ యేడాది ఫిబ్రవరి 28వ తేదీ చివరి శుక్రవారం రెండు థ్రిల్లర్ సినిమాలు విడుదలకానున్నాయి. వీటిలో ఒకటి అరివళగన్ దర్శకత్వంలో ఆది పినిశెట్టి నటించిన 'శబ్దం' కాగా, రెండోది జీవా హీరోగా దర్శకుడు పా.విజయ్ రూపొందించిన 'అగత్య'. ఈ రెండు శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. ఈ రెండు చిత్రాల్లోనూ ఒక ముఖ్యమైన వనమూలికను ప్రధాన కథాంశంగా చేసుకుని రూపొందించినట్టు ఆయా చిత్రాల ట్రైలర్స్ చూస్తే తెలుస్తుంది. ఈ రెండు హర్రర్ థ్రిల్లర్ మూవీల్లో ప్రేక్షకులు ఏ చిత్రాన్ని ఆదరిస్తారో శుక్రవారం వరకు వేచివుండాల్సిందే. వీటితో పాటు ఎస్.ఎ.చంద్రశేఖర్ ప్రధాన పాత్ర పోషించిన 'కూరన్', 'కడైసి తోట్టా' వంటి చిత్రాలు కూడా విడుదలకానున్నాయి. కాగా, గత శుక్రవారం విడుదలైన చిత్రాల్లో 'డ్రాగన్', 'నిలవుక్కు ఎన్నడీ ఎన్‌మేల్ కోబం' చిత్రాలు హిట్ టాక్ సొంతం చేసుకున్నాయి.



'అగత్య'లో ఓ దృశ్యం

తిరుచెందూర్ ఆలయ గోపురంపై భారీ శూలాయుధం



శూలాయుధం అమర్చుతున్న దృశ్యం

ప్యారీస్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ గోపురంపై 40 అడుగుల భారీ శూలాయుధాన్ని హిందూ దేవాదాయ శాఖ అమర్చింది. సుబ్రమణ్యస్వామి కొలువైన ఆరు ప్రసిద్ధ క్షేత్రాల్లో రెండవదైన తిరుచెందూర్ ఆలయానికి ప్రతిరోజు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. 15 ఏళ్ల తర్వాత ఈ ఆలయానికి జూలై 7వ తేది మహా కుంభాభిషేకం జరిపేందుకు దేవాదాయ శాఖ నిర్ణయంచింది. ఈ సందర్భంగా హెచ్‌సీఎల్ సంస్థ తరఫున రూ.200 కోట్లు, దేవాదాయ శాఖ తరఫున రూ.100 కోట్లు మొత్తం రూ.300 కోట్లతో ఆలయ ప్రాంగణం విస్తరణ, సంప్రోక్షణ, జీర్ణోద్ధరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 137 అడుగుల ఎత్తు, 9 అంతస్తులున్న రాజగోపురం పునరుద్ధరణ పనులు పురాతన శిల్ప కళా వైభవం చెక్కుచెదరకుండా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ గోపురంలో కొత్తగా 200 మందికి పైగా కళాకారులు డిజైన్ చేసిన 40 అడుగుల భారీ శూలాయుధాన్ని ఆదివారం గోపురంపై అమర్చారు. ఈ శూలాయుధం సుమారు 5 కి.మీ దూరం నుంచి చూసినా కనిపిస్తుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



ఆదివాసీయులతో అతిథులు, నిర్వాహకులు - ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కూచిపూడి నర్తకీమణులతో కేకే త్రినాధ్ కుమార్, కనిగెలుపుల శ్రీనివాసమూర్తి తదితరులు

సంప్రదాయ కళలకు పుట్టిల్లు భారత్

● మాతృభాషా దివస్‌లో వక్తల ప్రశంస

ప్యారీస్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కళలకు భారత్ పుట్టినిల్లని, కన్నియాకుమారి నుంచి కశ్మీర్ వరకు 29 రాష్ట్రాలు, 9 కేంద్రపాలిత ప్రాంతాలతో విస్తరించిన స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య దేశమని పలువురు వక్తలు కొనియాడారు. వెప్పేరిలోని అగర్వాల్ విద్యాలయ ప్రాంగణంలో భారత్ భారతి-చెన్నై, మాధవ్ సేవా సమితి చెట్‌పెట్ సంయుక్త ఆధ్వర్యంలో మాతృభాషా దివస్ సంబరాలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు నితిన్ అగర్వాల్, కృష్ణ నతాని, కేకే త్రినాధ్ కుమార్, అడ్వొకేట్ కనిగెలుపుల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్ సహా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర 20 రాష్ట్రాలకు చెందిన కళాకారులు ఈ సంబరాల్లో సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొని నృత్యాలతో అలరించారు. ముఖ్యఅతిథిగా గురునానక్ కళాశాల డీన్ డాక్టర్ స్వాతి పాలివాల్, తమిళనాడు విద్యాభారతి కార్యదర్శి సుందర్‌జీ కళాకారులను అభినందించి వారికి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో త్రినాధ్ కుమార్ మాట్లాడుతూ... ఎన్నో అద్భుతాల సమూహం భారతదేశమన్నారు. అడ్వొకేట్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ... అన్ని మతాలు, వర్గాలు సమష్టి కలయిక, భిన్న సంస్కృతుల ఏకత్వం భారత్ అని కొనియాడారు. ముఖ్యఅతిథి స్వాతి పాలివాల్ మాట్లాడుతూ... దేశంలోని 20 రాష్ట్రాలకు చెందిన కళాకారులను ఒకే వేదికపైకి చేర్చి వారి వారి సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఈ వేడుకలు నిర్వహించారని నిర్వాహకులను అభినందించారు.



ఎస్కేడీటీ పాఠశాల ప్రాంగణంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవంలో డాక్టర్ కిషోర్, తాళ్లూరి సురేష్ తదితరులు

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

● లయన్ తాళ్లూరి సురేష్

ప్యారీస్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదిగి చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేయాలని లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై రాయల్టీస్ మెంటర్ లయన్ తాళ్లూరి సురేష్ పిలుపునిచ్చారు. విల్లివాక్కంలోని కనకదుర్గ తెలుగు మహోన్నత పాఠశాలలో రాయల్ కింగ్స్ క్లబ్ జిల్లా 324ఎం ఆధ్వర్యంలో క్లబ్ తరఫున విరాళమిచ్చిన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్.వరదరాజన్ ప్రారంభించారు. గౌరవ అతిథిగా ఎస్కేడీటీ పాఠశాలల ఉపాధ్యక్షులు డాక్టర్ సీఎం కిషోర్, కార్యదర్శి పోరూరి శ్రీనివాసరావు, అసిస్టెంట్ హెడ్మాస్టర్ ఎం.మోహననాయుడు, క్లబ్ సభ్యులు ఎస్.బోస్, రాజేష్ జోషి, చంద్రశేఖరన్, మీనాక్షి సుందరం, శేఖర్, హరికృష్ణన్, భువనేంద్రన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్లబ్ తరఫున అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ... తాను ఈ పాఠశాలలో తెలుగు మీడియం చదువుకుని నేడు ఉన్నత స్థానంలో ఉన్నానని, తనలాగే చదువుకున్న పాఠశాలకు మిగతా విద్యార్థులు కూడా తమ వంతు సాయం అందజేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ... పూర్వ విద్యార్థి తాళ్లూరి సురేష్ 2014లో ఈ పాఠశాలకు సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ విరాళంగా అందజేశారని, ఆయన నేతృత్వంలో క్లబ్ తరఫున నిర్వహిస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమన్నారు.



చెన్నై కామరాజర్‌రోడ్డులోని ఉన్నతవిద్యా మండలి ప్రాంగణంవద్ద మాజీ ముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆమె విగ్రహానికి నివాళులర్పిస్తున్న తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి వి.రాజారామన్, పౌరసంబంధాల శాఖ సంచాలకులు డాక్టర్ ఇరా వైద్యనాథన్, పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులు ఎంపీ అన్బుచోళన్ తదితరులు



ట్రిప్లికేన్‌లోని సీఎం పార్మసీలో మందుల విక్రయాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న డా.సునీల్

ప్యారీస్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కంలో అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డా.వి.సునీల్ నేతృత్వంలో, 134వ వార్డు కార్యదర్శి కరాటే ఎస్.శేఖర్ సమక్షంలో కోడంబాక్కంలో వెయ్యి మందికి అన్నదానం, సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. ఎస్.అరుళ్‌మురుగన్, సుడలిముత్తు తదితర పార్టీ నిర్వాహకులు పాల్గొని, డా.సునీల్‌తో కలసి జయలలిత చిత్రపటానికి నివాళులర్పించారు.

సవీత వైద్యురాలి అరుదైన ఘనత



డాక్టర్ నందినిదేవిని సత్కరిస్తున్న నిర్వాహకులు

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సవీత డెంటల్ కాలేజీ, సిమాట్స్ పీడియాట్రిక్ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రీ విభాగానికి చెందిన డాక్టర్ నందిని దేవి అరుదైన రికార్డు సాధించారు. ఆమె జనరల్ అనస్థీషియా కింద 110 ఫుల్‌మౌత్ రిహాబిలిటేషన్స్, కాన్షియస్ సెడేషన్ కింద 132 కేసులను తన పోస్ట్‌గ్రాడ్యుయేట్ శిక్షణ సమయంలో విజయవంతంగా పూర్తి చేసి, తొలి పీడియాట్రిక్ డెంటిస్ట్‌గా ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ మేరకు నిర్వాహకులు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సిమాట్స్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.ఎం.వీరయ్యాన్ డాక్టర్ నందిని దేవిని ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు. ఇది సవీత విశ్వవిద్యాలయ ఉన్నత విద్యాప్రమాణాల ప్రతిబింబంగా అభివర్ణించారు.

తిరువళ్లూరులో 27 నుంచి తెప్పోత్సవాలు



ఇష్టదేవేరులతో వైద్య వీరరాఘవపెరుమాళ్

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాల్లో ఒకటైన తిరువళ్లూరు వైద్య వీరరాఘవ పెరుమాళ్ ఆలయంలో మాసిమాస తెప్పోత్సవాలు ఈ నెల 27న ప్రారంభమవుతున్నారు. ఈ ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుండి కూడా భక్తులు వస్తుంటారు. ప్రతి నెలా అమావాస్య రోజు రాత్రంతా భక్తులు ఆలయ ప్రాంగణంలో బసచేసి, మరుసటి రోజు వేకువజాము స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మాసి తెప్పోత్సవాలు ఈ నెల 27 నుండి మూడు రోజులపాటు జరుగనున్నాయి. ఆ మూడు రోజులు స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతుడై తెప్పమీద విహరించనున్నారు. ప్రస్తుతం ఆలయ తీర్థ కొలనులో తెప్ప నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి.

జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలు



జీఎస్టీ రోడ్డులోని తపాలా కార్యాలయంలో బోర్డుపై హిందీ అక్షరాలను నల్ల రంగుతో చెరిపివేస్తున్న డీఎంకే శ్రేణులు

వేళచ్చేరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో అధికార డీఎంకే శ్రేణులు నిరసనలు చేపడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వేస్టేషన్ల ప్రాంగణాల్లో బోర్డులపై హిందీ అక్షరాలను నల్లరంగుతో చెరిపేస్తూ నిరసనలకు పాల్పడుతున్నారు. మరోవైపు నూతన విద్యా విధానంతో మాతృభాష తమిళం కనుమరుగవుతుందంటూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ నిరసన ప్రచారం చేపట్టారు. ఈ నేపథ్యంలో సెయింట్ థామస్ మౌంట్ జీఎస్టీ రోడ్డులోని తపాలా కార్యాలయ బోర్డుపై ఉన్న హిందీ అక్షరాలను సోమవారం మధ్యాహ్నం డీఎంకే శ్రేణులు నల్లరంగుతో చెరిపేశారు. అలాగే, కోవై జిల్లా పొల్లాచ్చి, తిరునల్వేలి జిల్లా పాళయంకోట రైల్వేస్టేషన్లలోని బోర్డులపై ఉన్న హిందీ అక్షరాలను డీఎంకే శ్రేణులు చెరిపివేశాయి. ఈ ఘటనపై ఆయా ప్రాంతాల పోలీసులు కేసులు నమోదుచేసి విచారణ చేపట్టారు.

రాష్ట్ర మార్కెట్లోకి కాస్మోస్ కుక్‌వోక్



కుక్‌వోక్ ఆవిష్కరణలో నిర్వాహకులు

చెన్నై, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్కెట్లోకి 'కాస్మోస్ కుక్‌వోక్' ప్రవేశించింది. సంస్థ సింగపూర్ సీఈవో సి.శంకరనాథన్, ఎస్ఎం సీఈవో ఎం.సతీష్‌కుమార్, ది రెసిడెన్సీ టవర్స్ డైరెక్టర్ అజిత్ జనార్ధనన్, జీఆర్టీ హోటల్స్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ శీతలాం ప్రసాద్, సంగీత రెస్టారెంట్ ఎండీ రాజగోపాల్ తదితరులు సోమవారం చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. కాస్మోక్ కుక్‌వోక్ మినీ అనేది తమ సంప్రదాయ కాస్మోక్ కుక్‌వోక్స్ టేబుల్ టాప్ వర్షన్ అని తెలిపారు. సహజంగా సంప్రదాయ కుక్‌వోక్స్ 80 నుంచి 1000 లీటర్ల వరకు వుంటాయని, కానీ కొత్తగా ఆవిష్కృతమైన కుక్‌వోక్స్ కేవలం కిలో నుంచి 10 కిలోల వరకు ఉత్పత్తుల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని కలిగి వుంటుందని వివరించారు.

మాల గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాల గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎస్వీయూ అసిస్టెంట్ ఇంజినీర్ వెంట్రపాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. తిరుపతిలో నిర్వహించిన మాల గెజిటెడ్ అధికారుల సంఘం రాయలసీమ స్థాయి సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మాల గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పదోన్నతుల్లో తగిన న్యాయం కోసం ప్రయత్నం చేస్తానన్నారు. శ్రీనివాసరావును ఏపీ మాల గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు జయరాం, దినకర మూర్తి, కృష్ణమూర్తి, మునెయ్య, శ్రీలక్ష్మి, గురుమూర్తి, మరియదాస్, దుర్గేష్ అభినందించారు.

నేటి నుంచి శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ మంగళ, బుధ, గురువారాల్లో జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. భక్తుల రద్దీని అనుసరించి మంగళవారం 87, బుధవారం 209, గురువారం 140 అదనపు బస్సులు నడపనుంది. ఇందులో తిరుపతి, కోడూరు-తలకోన, గుడిమల్లం, శ్రీకాళహస్తి-తిరుపతి, నాయుడుపేట, గూడూరు, పిచ్చాటూరు, తడ, చెన్నై, గుడిమల్లం, పుత్తూరు-సదాశివకోన, కైలాసకోన, మూలకోన, ఊత్తుకోట-సదాశివకోన, వరదయ్యపాళెం-అవంతి, కోట, నాయుడుపేట-పంట్రంగం. పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, శ్రీశైలం, మదనపల్లెకు వెళ్లనున్నాయి. ఈ కారణంగా తిరుమల, కాణిపాకం, ఇతర ప్రదేశాలకు మూడు రోజుల పాటు బస్సుల కొరత ఏర్పడే అవకాశముంది.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 14 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

- శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.55 కోట్లు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,892
- తలనీలాలు సమర్పించినవారు: 25,930

పరమశివుడు ప్రతిష్ఠించిన యోగలింగం

- కైలాసనాథకోనలో హరోంహరా..



కైలాసనాథకోన జలపాతం



విశేష అలంకరణలో కైలాసనాథుడు



నారాయణవనం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి రమణీయత.. ఆధ్యాత్మికతల కలబోత కైలాసనాథకోన. ఉరికే జలపాతాలు.. ఎత్తయిన గిరులతో ఆహ్లాదకర వాతావరణం ఈ ప్రాంత ప్రత్యేకత. సాక్షాత్తూ పరమశివుడే ఇక్కడ అందాలకు ముగ్ధుడయ్యాడు. అందుకే ఇక్కడ కైలాసనాథుడిగా కొలువుదీరాడు. నారాయణవనం మండలం పాలమంగళం పంచాయతీ పరిధిలోని కైలాసనాథ కోనలో యోగలింగాన్ని దర్శించుకుని భక్తులు తాదాత్మ్యం చెందుతారు. హరుడి దర్శనం కోసం పరిసరాల నుంచే కాదు తమిళనాడు, కర్ణాటకల నుంచీ భక్తులు, పర్యటకులు వస్తుంటారు.

స్థల పురాణం

నారాయణవనంలో కల్యాణ వెంకన్న, పద్మావతీ దేవిల వివాహానికి ఆకాశరాజు పార్వతీ పరమేశ్వరులను ఆహ్వానించారని ఇతిహాస గాథ ప్రచారంలో ఉంది. ఆ క్రమంలోనే వచ్చిన శివపార్వతులు నయన మనోహరమైన కోన ప్రకృతిని చూసి ఆనందపరవశులయ్యారు. ఆ సమయంలోనే శంకరుడు యోగ లింగాన్ని ప్రతిష్ఠించాడని ప్రతీతి. ఈ విషయం తెలుసుకున్న అగస్త్య మహాముని కోనకు వచ్చి ఆరు మాసాలు తపస్సు చేశారని చెబుతారు. కల్యాణానంతరం వేంకటేశ్వరుడు లక్ష్మీ సమేతుడై వచ్చి పరమేశ్వరుడ్ని దర్శించుకుని అగస్త్య మహాముని ఆధ్వర్యంలో కామాక్షి అమ్మవారిని ప్రతిష్ఠించారంటారు. ఇది చాలా విశేషమైన ప్రదేశమని, పరమేశ్వరుడి జటాజూటం నుంచి గంగ జాలువారుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. స్వామికి కుడివైపు గంగాదేవి, ఎడమవైపు కామాక్షి దేవి కొలువుదీరి దర్శనమిస్తారు. కోనలో స్నానమాచరిస్తే కాశీలో పుణ్యస్నానం చేసినట్టు భావిస్తారు. వెంకట చలపతి మహత్యం పురాణంలో ఈ కోనశివుడి ప్రస్తావన ఉందని చెబుతారు.



కామాక్షి అమ్మవారు

భక్తుల తాకిడి


దేవదాయశాఖ పరిధిలోని కైలాసనాథకోన పర్యాటకులు, భక్తులతో సందడిగా ఉంటుంది. కార్తీక మాసంలో భక్తుల తాకిడి మరింత పెరుగుతుంది. ఈ పుణ్యతీర్థంలో స్నానమాచరించి, కైలాసనాథుడిని దర్శనం చేసుకుంటారు. కోనలో స్నానమాచరిస్తే సర్వపాపాలు హరించి, ముక్తి లభిస్తుందని నమ్ముతారు. అయ్యప్ప భక్తులు కూడా ఇక్కడ పుణ్యస్నానాలు చేసి మాలధరిస్తారు. శివరాత్రి సందర్భంగా ఇప్పటికే ఆధ్యాత్మిక సందడి ప్రారంభమైంది. బుధవారం వేడుక నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో కృష్ణనాయక్ తెలిపారు.

ఇలా చేరుకోవచ్చు..

పుత్తూరు నుంచి 13 కిలోమీటర్లు, నగరి నుంచి 20 కిలోమీటర్లు, తిరుపతి నుంచి 46 కిలోమీటర్లు, చిత్తూరు నుంచి 76 కిలోమీటర్లు ప్రయాణించి కైలాసకోన చేరుకోవచ్చు. పుత్తూరు బస్టాండు నుంచి రోజూ బస్సు సౌకర్యం ఉంది. నారాయణవనంలో దిగితే ఆటో, ఇతర వాహనాలుంటాయి. అటవీప్రాంతం కావడంతో రాత్రి వేళ ప్రయాణం క్షేమకరం కాదు. పర్యాటక శాఖకు చెందిన ఆరు, దేవదాయశాఖకు చెందిన మూడు అతిథిగృహాల్లో భక్తులు సేదతీరవచ్చు.




దశకంఠుడిపై పరమశివుడి విహారం



రావణ, మయూర వాహనాలపై స్వామిఅమ్మవార్ల పురవిహారం



వినాయకస్వామి, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్పల ఊరేగింపు



హంస, యాళివాహనాల్లో ఉత్సవర్లు

బ్రహ్మోత్సవాల్లో నేడు:
- ఉదయం 9 గంటలకు: హంస- శుక వాహనసేవ
- రాత్రి 8 గంటలకు: శేష- యాళి వాహనసేవ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాల్గో రోజైన సోమవారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు రావణవాహనంపై అధిరోహించి పురవిహారం చేశారు. ఆయన పక్కనే జ్ఞానప్రసూనాంబ అమ్మవారు మయూర వాహనంపై ముందుకు సాగారు. అంతకుముందు అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. ఉదయం బంగారు హంస వాహనంపై స్వామివారు, బంగారు యాళివాహనంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు ఊరేగారు. ఉదయం, రాత్రి స్వామి, అమ్మవార్ల ఊరేగింపును మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. వాహన సేవల ముందు కోలాట కళాకారుల నృత్యాలు, భక్తుల శంఖానాదం, శివనామస్మరణలు మార్మోగాయి. మాడవీధుల్లో ఉత్సవర్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు పలికారు. ఉభయదారులుగా కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన చిట్టాప్రగడ సీతారామాంజనేయులు కుటుంబ సభ్యులు.. జూలుగంటి సుబ్బారావు, నాగలక్ష్మి వ్యవహరించారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సారె సమర్పణ

స్వామి, అమ్మవార్లకు మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వం తరఫున సారె సమర్పించనున్నారు. మధ్యాహ్నం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టు వస్త్రాలను తీసుకురానున్నారు.

టైరు పంక్చరవడంతో అదుపుతప్పి బస్సు బోల్తా

- 17 మందికి గాయాలు.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం



ప్రమాదం జరిగిన ప్రదేశంలో పోలీసులు, హైవే సిబ్బంది సహాయక చర్యలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చుట్టూ చీకటి. నిద్రమత్తులో ప్రయాణికులు. ఒక్క కుదుపుతో బోల్తాపడిన బస్సు. ఏమైందో.. ఏం జరిగిందో తెలియక ఒకటే అరుపులు. ఇదీ సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారి పై ఆదివారం అర్ధరాత్రి దాటాక పరిస్థితి. పాండిచ్చేరి నుంచి విజయవాడకు ప్రయాణికులతో వస్తున్న మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు ఆదివారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు క్రాస్‌రోడ్డు సమీపానికి వచ్చింది. ఆ సమయంలో టైరు పంక్చరు అయింది. వేగంగా వస్తున్న బస్సును డ్రైవరు అదుపు చేయలేకపోయారు. దీంతో హైవే రెయిలింగ్‌ను ఢీకొని దాదాపు 10 అడుగుల లోతులో బస్సు బోల్తాపడింది. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తన సిబ్బందితో అక్కడకు చేరుకొన్నారు. స్థానికుల సహకారంతో క్షతగాత్రులను బయటకు తీసి.. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో 34 మంది ప్రయాణికులు ఉండగా, 17 మందికి గాయాలయ్యాయి. వీరిలో బస్సు రెండో డ్రైవర్ సాయి సిద్దేష్, ప్రయాణికుడు ఎ.చందుకు తీవ్ర గాయాలై, పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నైకి తరలించారు. బస్సు ముందుభాగం నుంచి సగం వరకు నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదానికి కారణం అతివేగమేనని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా నగలు ఉన్నాయా?

- బ్యాంకుకు ఖాతాదారుల పరుగు ● 30 మంది బాధితుల జాబితా ప్రదర్శన
- రికవరీ చేసిస్తామంటూ అధికారుల హామీ ● కొనసాగుతున్న పోలీసు విచారణ

నాగలాపురం, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని యూనియన్ బ్యాంకుకు సోమవారం పలువురు ఖాతాదారులు క్యూకట్టారు. తమ నగలు ఉన్నాయా అంటూ సిబ్బందిని ఆరా తీశారు. డిప్యూటి మేనేజర్ సూర్యతేజ్ చేతివాటం చూపి ఖాతాతారులకు సంబంధించిన 5,498 గ్రాముల బంగారు నగలను తీసుకెళ్లి బయట తనఖా పెట్టి రూ.2.35 కోట్లు తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై యూనియన్ బ్యాంకు తిరుపతి రీజనలల్ డీజీఎం బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు బ్యాంకు మేనేజర్ తిరువరాజ్, డిప్యూటి మేనేజర్ సూర్యతేజ్‌పై ఎస్‌ఐ సునీల్ శుక్రవారం కేసు నమోదు చేశారు. దీంతో గోల్డ్ లోన్ తీసుకున్న వారిలో ఆందోళన నెలకొంది. శని, ఆదివారాలు సెలవు కావడంతో.. సోమవారం ఖాతాదారులు బ్యాంకుకు వచ్చారు. కాగా, డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్ 30 మంది ఖాతాదారుల నగలను బయట ప్రాంతాల్లో కుదువ అంగళ్లు, ఫైనాన్స్ సంస్థల్లో కుదువపెట్టినట్లు గుర్తించారు. ఈ 30 మంది ఖాతాదారుల జాబితాను అధికారులు బ్యాంకులో అతికించారు. వీరి నగలు రికవరీ చేసిచ్చేందుకు హామీ ఇచ్చారు. మరోవైపు మిగిలిన 36 మంది ఖాతాదారులు తమ నగలను విడిపించుకునేందుకు ఎగబడ్డారు.

సీఐ కార్యాలయాన్ని సంప్రదించండి

సత్యవేడు సీఐ మురళి సోమవారం బ్యాంకు అధికారులతో విచారణ కొనసాగించారు. ఘటనపై సిబ్బందిని, బ్యాంకు అధికారులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. 30 మంది జాబితాలోని ఖాతాదారులు బ్యాంకులో కుదువ పెట్టిన నగలకు సంబంధించిన రసీదులతో సత్యవేడు సీఐ కార్యాలయాన్ని సంప్రదించి విచారణకు సహకరించాలని ఆయన కోరారు. మరో రెండు మూడు రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని, నగల రికవరికీ కొంత వ్యవధి పడుతుందన్నారు.

అధికారులే బాధ్యత వహించాలి

నా కుటుంబ అవసరాల నిమిత్తం 2024 జూలై 26వ తేదీన 234 గ్రాముల బంగారు నగలను తాకట్టుపెట్టి రూ.3.9 లక్షల రుణం తీసుకున్నా. 30 మంది బాధిత ఖాతాదారుల జాబితాలో నా పేరు ఉంది. నా నగలకు బ్యాంకు అధికారులే బాధ్యత వహించాలి.

\- చిట్టిబాబు, నాగలాపురం

కీళడిలో ఓపెన్ ఎయిర్ మ్యూజియం పనులు ప్రారంభం



ఓపెన్ ఎయిర్ మ్యూజియం నమూనా చిత్రం

ప్యారీస్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా త్రిభువనం పంచాయతి పరిధిలోని కీళడి ప్రాంతంలో ఓపెన్ ఎయిర్ మ్యూజియం నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. కీళడి, పరిసర ప్రాంతాల్లో 2015వ సంవత్సరం నుంచి పురావస్తు శాఖ నిపుణులు తవ్వకాలు చేపట్టారు. ఇందులో గత ఏడాది నిర్వహించిన 9వ విడత తవ్వకాలు పూర్తికాగా, ప్రస్తుతం 10వ విడత తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ తవ్వకాల్లో తొలి మూడు విడతల్లో కేంద్ర పురావస్తు శాఖ తవ్వకాలు చేయగా, మిగిలిన ఏడు విడతల పనులను రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఇప్పటివరకు నిర్వహించిన తవ్వకాల్లో సుమారు 2,600 సంవత్సరాల క్రితం నాటి తమిళ శాసనాలు, తమిళ సంస్కృతి, ఆదిమానవుల జీవన విధానాలు, తమిళ అక్షరాలతో ఉన్న మట్టిపాత్రలు తదితర అరుదైన కళాఖండాలు బయల్పడ్డాయి. వీటి విశిష్టతను ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో కీళడి ప్రాంతంలో ఓపెన్ ఎయిర్ మ్యూజియం నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. గత నెల 23వ తేది రూ.17.80 కోట్లతో ఈ మ్యూజియం నిర్మాణానికి దృశ్య మాధ్యమం ద్వారా సీఎం స్టాలిన్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఈ నెల 16 నుంచి పనులు ముమ్మరం చేసినట్లు రాష్ట్ర మంత్రులు తంగం తెన్నరసు, పెరియకరప్పన్‌లు మీడియాకు తెలిపారు.

ఏడు పదుల వయసులో నీటిపై తేలుతూ యోగా !



తామ్రభరణి నదిపై తేలుతూ యోగా చేస్తున్న షణ్ముగ సుందరం

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా ఆళ్వార్ తిరునగరి ప్రాంతానికి చెందిన షణ్ముగసుందరం ఏడుపదుల దాటిన వయస్సులో భావితరాలకు యోగాపై అవగాహన కల్పించేలా తామ్రభరణిలో నీటిపై తేలియాడుతూ యోగా చేసి అందరిని ఆకట్టుకుంటున్నారు. 72 యేళ్ల షణ్ముగసుందరం హెడ్మాస్టర్‌గా పనిచేసి రిటైరయ్యారు. అప్పటి నుంచి ఆయన విద్యార్థులకు ఉచితంగా యోగం, కర్రసాము తదితర ఆత్మరక్షణ కళలను నేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల నుండి వచ్చే వ్యర్థాల వల్ల తామ్రభరణి కాలుష్యం ఏర్పడుతుండటం గమనించి, ఆ నదిని కాలుష్యం బారి నుండి కాపాడేలా ఆ నదిలో తేలియాడుతూ జలయోగ సూర్య నమస్కరం చేసి స్థానికుల అభినందనలు అందుకున్నారు. అదే సమయంలో చిన్నారులకు ఈత కూడా నేర్పుతున్నారు. తాజాగా విద్యార్థులు, స్థానికుల సమక్షంలో తామ్రభరణి నదిపై తేలియాడుతూ వివిధ యోగాసనాలను చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా షణ్ముగసుందరం మాట్లాడుతూ యోగాభ్యాసం చిన్నారులకు అత్యంత అవసరమని, అదే విధంగా పిన్నవయస్సులోనే ఈత నేర్చుకోవాలని, కర్రసాము మంచి ఆత్మరక్షణ కళ అని అందువల్లే తాను నీటిపై తరచూ తేలియాడుతూ యోగాసనాలు వేస్తున్నానని వివరించారు.